


**- సి. బాలామణి**

"సీతమ్మగారూ, ఆవిడకి కొబ్బరికాయ పచ్చడి అంటే చాలా ఇష్టం. కొబ్బరి చెక్కలు కోరండి."

"అలాగేనండి" అని చెప్పి, "కూరలేం వండమంటారు?" అని వినయంగా అడిగింది సీతమ్మ.

"చేమ, పెండలం, దొండకాయ, అరటికాయ ఈ నాలుగూ వండండి. ఈ కూరలంటే ఆవిడకు చాలా ఇష్టం. అల్లం పచ్చడి, నూపప్పు పచ్చడి, దోసకాయ, కొబ్బరికాయ పచ్చడులు చేయండి. పరమాన్నానికి కేంద్రం పాలు తెప్పించాను, బాగుంటాయని. పెరుగుకూడా బాగుండాలని కేంద్రం పాలు తెప్పించి తోడు పెట్టాను. గారెలకు ఈ మినపప్పు నీళ్ళలో పోయండి." ఏక ధాటిగా చెప్పింది నరసమాంబ.

"ఆవిడకు అరిసెలంటే చాలా ఇష్టం—అందువల్ల అరిసెలే చెయ్యండి."

"ఆవిడకు పెసరపప్పు అంటే ఇష్టం. అందువల్ల మధ్య మధ్య కందిపప్పు మాని పెసరపప్పు వండేదాన్ని. రాత్రుళ్ళు అన్నం తినేవారు కారు. అప్పుడప్పుడు గారెలుకూడా చేసేదాన్ని, ఆవిడ కిష్టమని. ఏమిటో — తలుచుకుంటే బాధగానే ఉంటుంది." కళ్ళు తుడుచుకుంది నరసమాంబ.

"ఎంత అదృష్టవంతురాలండీ, మీ అత్తగారు! మీ లాటి కోడలు దొరకడం ఎంత అదృష్టం! ఈ రోజుల్లో శ్రద్ధగా తద్దినాలు ఎవరు పెడుతున్నారండీ? చచ్చిపోయిన వాళ్ళని అసలు తలపెట్టుకుంటున్నారా?" సాగదీసింది సీతమ్మ.

సీతమ్మ వంట చేస్తూంటే, అత్తగారిని తానెలా చూసేది [illegible] గారాబంగా పెంచింది. భర్త లేదనే

తనకెంత ఆదరాభిమానాలు ఉన్నవి చెపుతూంది నరసమాంబ, మధ్య మధ్య సీతమ్మ పొగడ్తలు అందుకుంటూ.

పక్క గదిలో పడుకుని అంతా శ్రద్ధగా వింటూన్న గోపాలరావు దీర్ఘంగా నిట్టూర్చాడు.

తను అయిదు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి కాంతమ్మ అష్ట కష్టాలూ పడి ఎంతో

# జయచిత్రకు మహదానందాన్నిచ్చినవి!





అభిమాన చిత్రం : సోగ్గాడు
స్కూల్లో చదువుకునే రోజుల్లో: సినిమా చూసేందుకు
స్కూలు ఎగవేసిన క్షణాలు.
మరుపురాని రోజు : మొదటి చిత్రం యొక్క
అగ్రిమెంట్‌పై సంతకంపెట్టిన రోజు
ఆమెకు అందాన్నిచ్చే సబ్బు : ఆమెకు ప్రియమైన లక్స్






"లక్స్ అంటే నాకెంతో ఇష్టం. శుద్ధమైన,
సౌమ్యమైన లక్స్ నా రూప లావణ్యాన్ని మృదువుగా,
అందంగా రూపొందిస్తుంది." అంటారు జయచిత్ర.

## శుద్ధమైన, సౌమ్యమైన లక్స్–సినిమా తారలకు అందాన్నిచ్చే సబ్బు

L.9632A

హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి ఉత్పాదన

వింతలో, తన మీదే ఆశలన్నీ పెట్టు కుని పెంచి పెద్ద చేసింది. ఎప్పుడేనా తనని ఏడవ నిచ్చిందా? చిన్నప్పుడుకూడా తనని ఎప్పుడేనా తిట్టిందా? కొట్టిందా? తన తల్లి కోప్పడగా ఎప్పుడేనా చూశాడా? తాను తినడంకూడా మానేసి కొడుకుకే పెట్టేది. అమ్మ తన వెంత ప్రేమగా చూచేది!

"ఒరేయ్, గోపాలం! ఈ రోజు ఇంట్లోనే ఉన్నావు" అంటూ వచ్చాడు నారాయణ.

"ఈ రోజు అమ్మ ఆబ్దికం. అందు చేత ఆఫీసుకి సెలవు పెట్టాను" అన్నాడు గోపాలరావు.

"ఏరా, అలా డల్‌గా ఉన్నావు?" ప్రశ్నించాడు నారాయణ.

"లేదురా. అమ్మ జ్ఞాపకాలు నన్ను చాలా బాధ పెడుతున్నాయి." బాధగా అన్నాడు గోపాలరావు.

"పెద్దావిడ-కాలం తీరి వెళ్ళిపోయింది. నీవు చేయవలసింది చేశావు. కొడుకుగా నీ బాధ్యత నెరవేర్చుకున్నావు. ఏటేటా తద్దినం పెడుతున్నావు. ఆవిడకు మీవల్ల లోపం ఏముంది? బాధపడకు" అంటూ వెళ్ళిపోయాడు నారాయణ.

'అవును. అమ్మ చచ్చిపోయినప్పుడు అమ్మ చితికి నిప్పు పెట్టి, కర్మ చేశాడు. గోదానం చేశాడు. పెద్ద సంతర్పణ చేశాడు. ప్రతి ఏడూ తద్దినం పెడు తున్నాడు. అదేనా కొడుకుగా తన బాధ్యత? శ్రాద్ధం పెడతాడనేనా తనని నవ మాసాలూ మోసి కని పెంచింది?' విరక్తిగా నవ్వుకున్నాడు గోపాలరావు.

'పున్నామ నరకం నుండి తప్పించే వాడు పుత్రుడన్నారు పెద్దలు. అందుకనే నేమో ఆడపిల్ల పుడితే "—అయ్యో!" అనుకుని, మగపిల్లాడు పుడితే, "వంశో ద్ధారకుడు" పుట్టాడని సంబరపడ తారు చాలా మంది. తను పుట్టినప్పుడు కూడా అమ్మ ఎంతో సంతోషించి ఉంటుంది. ఆ పున్నామ నరకం ఉందో లేదో తెలియదు కాని, అమ్మ బ్రతికి ఉండ గానే నరకాన్ని అనుభవించింది. ఆ నరకం నుంచి అమ్మని తప్పించ గలి గాడా? హుఁ! లోకం దృష్టిలో గోపాల రావు చాలా మంచివాడు. నరసమాంబ చాలా ఉత్తమురాలు. అలాటి కొడుకునూ, కోడల్నీ పొందినందుకు కాంతమ్మ చాలా అదృష్టవంతురాలు. నిజం ఆలోచిస్తే తన భార్య ఎంత నీచురాలు! తానెంత దుర్మా ర్గుడు! కన్న తల్లినే నిర్లక్ష్యం చేసిన కటిక హృదయుడు. తన తల్లి తిన్నదీ, లేనిదీ ఎప్పుడైనా తాను చూచాడా? అమ్మ ఎప్పుడేనా తననీను కాని, తన భార్యను కాని చిన్న మాట అన్నదా? ఎంత చాకిరీ చేసేది. ఒక్క పూట [illegible] ఆ ఒక్క పూట సరిగా తినేదో, లేదో? రాత్రుళ్ళు మంచి నీళ్ళు తాగి పడుకునేది. పరిఅయిన కాఫీకి కాని, భోజనానికి కాని ఎప్పుడేనా నోచుకుందా? తాను భార్యా విధేయుడు. తన తల్లి బ్రతికి ఉండగా కడుపు నిండా తిండి పెట్టి, సరిగా చూడగలిగాడా? అయినా, తన తల్లి తన నెప్పుడూ శపించలేదు సరికదా, ఎంతో వాత్సల్యాన్ని చూపేది. ఇప్పుడు ఎక్క డుందో? బతికి ఉండగా పెట్టలేని ఈ పంచభక్ష్య పరమాన్నాలూ అమ్మ తింటుందా? ఏమో?' గోపాలం హృద యం ఆక్రోశిస్తూంది.

తద్దినం పెడుతున్నంత సేపూ గోపాలం హృదయం అశాంతితోనూ, అసంతృప్తితోనూ అలమటిస్తూనే ఉంది. భోజనంకూడా సరిగా చేయలేక పోయాడు. భోజనం చేసి వరండాలోం వడక కుర్చీలో అశాంతిగా తల పట్టుకుని కూర్చున్నాడు. కొబ్బరి పచ్చడి నంజుకుని గారెలు తింటూంది వంట గదిలో నరస మాంబ. 'ఎంత కుటిలురాలు తన భార్య! తన కిష్టమైనవి చేయించుకుని అత్త గారి మీద నెట్టుతూంది. తన తల్లి కేది ఇష్టమో తనకే తెలియదు. అమ్మ ఇష్టాయిష్టాలు కనుక్కునేది ఎవరు?' పేలవంగా నవ్వుకున్నాడు.

గూటిలోని పిచ్చుక పిల్లలు గొడవ చేస్తున్నాయి తల్లి కోసం. అంతలోనే తల్లి పిచ్చుక వచ్చి ఆహారం తెచ్చి వాటి నోటిలో వేస్తూంది.

'తన తల్లి తనని ఇలాగే పెంచింది. పిల్లలుగా ఉన్నప్పుడే తల్లి కోసం ఆరాటం. చిన్నప్పుడు తను అది కావాలి, ఇది కావాలి అని మారాం చేస్తూ తల్లి చీర కొంగు పుచ్చుకుని కూడా కూడా తిరిగే వాడు. పెద్దవాడయ్యాక భార్యకు పాదా క్రాంతుడై కర్తవ్యాన్ని విస్మరించాడు. తల్లీ, తండ్రీ తానే అయి పెంచిన తన తల్లి ఋణం తాను తీర్చుకోలేక పోయాడు. తన భీర్యని అనుకోవడ మెందుకు? తన బుద్ధి ఏమయింది? నిజంగా తను హంతకుడు. తన తల్లి చావుకి కారకుడు తాను కాదా? తనది ఎంత నికృష్టపు జన్మ! వేసవిలో తిరుపతి ప్రయాణం పెట్టుకున్నారు. తన తల్లిని తీసుకెళ్ళాలని తన కెంతో కోరికగా ఉంది. పిల్లలను చూస్తుంది కదా అని తన భార్య ఒప్పుకుంది. తను, తన భార్య, పిల్లలు హోటలులో కడుపు నిండా తినేవారు. మడీ, ఆచారం పేరుతో అమ్మ ఏమీ తినేది కాదు. కనీసం పళ్ళు అయినా కొని ఇచ్చాడా? పిచ్చితల్లి! తిండి లేక ఇంటికి వచ్చిన రెండు రోజులకే చచ్చిపోయింది. తానెంత కిరాతకుడు! తాను మాతృ హంతకుడు కాదా? హుఁ! తన లాంటి దౌర్భాగ్యులు ఎంతమందో ఈ లోకంలో! బ్రతికి ఉండగా తల్లి తండ్రులకు పట్టెడన్నం పెట్టలేని వాళ్ళు తద్దినాలు పెడుతున్నారు. బ్రతికి ఉండగా లేనిది, చనిపోయాక ఎందుకు?

'అమ్మా! ఈ నీచుడిని క్షమించ గలవా? నీవు పోయిన నాటినుంచి నా హృదయానికి శాంతి లేదు. నా పాపానికి నిష్కృతి లేదు.' గోపాలరావు చెంపల మీదుగా కన్నీరు ప్రవహిస్తూంది.

"బాబూ!" తన తల్లి ప్రేమగా పిలుస్తూంది.

"అమ్మా!" కళ్ళు తెరచి ఆత్రంగా చూచాడు.

ఎదురుగా తన తల్లి లాంటిదే మరొకరి తల్లి నిలబడి ఉంది.

"బాబూ! నా స్థితి చెప్పుకునేందుకు నాకు చాలా సిగ్గుగా ఉంది. కాని, పరిస్థితుల ప్రాబల్యం వల్ల సిగ్గు విడిచి చెప్పుకోవలసి వస్తూంది. ఏం చెయ్యను? నా కొడుకూ, కోడలూ నన్ను ఇంట్లోంచి వెళ్ళగొట్టారు. నేను చేసిన నేరం ఏమీ లేదు. వృద్ధా ప్యంలో నే నింకా బ్రతికి ఉండడమే నా నేరం. నిన్నటినుంచీ భోజనం లేదు." ఆమె అభిమానంతో తల వంచుకుంది.

గోపాలరావు దిగ్గున లేచాడు. "కాళ్ళు కడుగుకుని రా, అమ్మా!" అంటూ వంట గదిలోకి నడిచాడు. అరిసెలన్నీ పెద్ద డబ్బాలోకి సర్దుతూంది నరస మాంబ. పీట వాల్చి మంచి నీళ్ళు పెట్టి, ఆకు వేసి స్వయంగా వడ్డించి ఆ ముసలా విడను తినమన్నాడు. భార్య ఏదో అనబోతే నోరు మూసుకోమన్నాడు. 'తన తల్లి బ్రతికి ఉండగానే ఈ పని చేసి ఉంటే ఎంత బాగుండేది!' అనుకున్నాడు.

ఆమె తృప్తిగా భోజనం చేసింది. ఇప్పుడు గోపాలరావు హృదయం తృప్తిగా ఉంది. హృదయం లోని బరువంతా తగ్గిపోయింది.

"ఇక నుంచి నీవు ఇక్కడే ఉండిపో, అమ్మా!" అన్నాడు.

'ఇది కలా? కథా? సినిమానా? నిజమా?' అని ఆశ్చర్యపోతూ, "బాబూ! నీవు ఎంత మంచివాడవు! నీ లాంటి కొడుకుని కన్న ఆ తల్లి ఎంత అదృష్టవంతురాలు!" అంది ఆమె ఆనందాశ్రువులు రాలుస్తూ.

"లేదమ్మా! నేనూ నీ కొడుకు లాంటి వాడనే" అన్నాడు బాధగా గోపాలరావు. *

జల విహారం చిత్రం—పి. మారుతి మోహన్ (హైదరాబాదు—7)

